నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

అధ్యక్షా..!

జిల్లా అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న సామెతను తలపిస్తోంది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో పాలక, ప్రతిపక్ష సభ్యులు జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై గళం విప్పాలి. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామనే హామీల అమలు చేయాలని పేర్కొన్న సంగతి తెలిసిందే. 2014లో విభజిత రాష్ట్రంలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శాసనసభ తొలి సమా వేశాల్లో ఒక్కో జిల్లాను తనదైన శైలిలో అభివృద్ధి చేస్తామని హామీల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. పదేళ్ల వ్యవధిలో పాలక పార్టీలైన టిడిపి, వైసిపి ఉక్కు పరిశ్రమ మొదలుకుని ఇచ్చిన హామీల్లో ఎటువంటి పురోగతీ లేదు. గండికోట ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటరీలు, ఫీల్డ్‌కాల్వలు, లేక పోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. గాలేరు-నగరి ఫేజ్-2 పనులకు గ్రహణం వీడలేదు. కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతల పనుల్లో పురోగతి కనిపించలేదు. కడప సూపర్‌స్పెషాలిటీ నిపుణుల నియామకాలు, పరికరాల ఏర్పాటు, టెక్నీషియన్ల నియామకాలు ఎప్పుడు చేపడతారో తెలియడం లేదు.

- 'ఉక్కు'పై స్పష్టత కరువు
- కదలని ఇరిగేషన్ పనులు
- నేటి నుంచి శాసనసభ సమావేశాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలో శాసనసభ సమావేశాల కోలాహలం నెలకొంది. ఈమేరకు కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు రాజధానులకు చేరుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప, అన్నమయ్య జిల్లాల్లోని 13 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను వైసిపి, రెండు శాసనసభ స్థానాలు మినహా మిగిలిన 11 స్థానాల్లో ఒక్కొక్కటి చొప్పున జనసేన, బిజెపి దక్కించుకోగా, మిగిలిన తొమ్మిది స్థానాల్ని టిడిపి కైవసం చేసుకుంది. ఈనేపథ్యంలో జిల్లా సమగ్రాభివృద్ధి బాధ్యత అధికార, ప్రతిపక్షాల భుజాలపై పడింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పైచేయి సాధించిన నేపథ్యంలో జిల్లా ప్రగతి పరుగులు తీయించాల్సిన బాధ్యత ఉంది. 2017 నవంబర్‌లో అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రలో మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్పత్తిని సైతం ప్రారంభిస్తామని హామీనిచ్చారు. కానీ ఆరేళ్లు గడిచిపోయినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనుల్లో నెలకొన్న స్తబ్ధతను తొలగించి, రాష్ట్రప్రభుత్వ వాటాను జత పరిచి పట్టాలెక్కించాల్సిన అవసరం ఉరుముతోంది.

రాయలసీమకు గండికోట ప్రాజెక్టు గుండెకాయ. గత మూడేళ్లుగా గండికోట ప్రాజెక్టును 26.86 టిఎంసిలతో నింపుతున్నారు. కానీ నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. 1994 నుంచి 23 గ్రామాల వారికి పునరావాస సదుపాయం కల్పన సాగుతూనే ఉంది. ఆరేళ్లుగా గాలేరు-నగరి ఫేజ్ - 2 పనులకు గ్రహణం తొలగడం లేదు. కడపలో రూ.12 కోట్లతో ఫుడ్‌పార్కును ఏర్పాటు చేస్తానని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పదేళ్లుగా ఫుడ్‌పార్క్ కాగితాలకే పరిమితమంది. ఫుడ్‌పార్క్ ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేది. ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని కొర్రపాడు రోడ్డు సమీపంలో 76. 17 ఎకరాలను 47 ప్లాట్లుగా విభజించిన సంగతి తెలిసిందే. రూ.55 కోట్లతో అపెరల్ పార్కు పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో చేనే తలు ఉన్న సంగతి తెలిసిందే. 2005-06లో మాజీ సిఎం కీ.శే వైఎస్ఆర్ మైలవరం మండలంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు. సుమారు 60 ఎకరాలను 128 ప్లాట్లుగా విభజించారు. రూ.7.4 కోట్లతో పనుల పురోగతి అంతం తమాత్రమే.

పులివెందుల సమీపంలో రూ.396 కోట్లతో 644 ఎకరాల్లో అంత ర్జాతీయ పశుపరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎపి కార్ల్‌లో రూ. 255 కోట్లతో పరిపాలనా భవనానికి వ్యయం చేశారు. గత బడ్జెట్‌లో పరిశోధనలకు అరకొర నిధులు కేటాయించారు. ఇక్కడ అంతర్జాతీయ స్థాయిలో సుప్రసిద్ధ పశువుల పిండాలను సంకరీకరణ ద్వారా వాతావరణానికి తట్టుకోగల నూతన జాతి పశువులను సృష్టించడానికి చర్యలు తీసుకున్నారు. దానికి పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపులు చేయాల్సి ఉంది యోగి వేమన యూనివర్శిటీపై చిన్నచూపు కొనసాగుతోంది. 2008లో రూ.100 కోట్ల వ్యయంతో యూనివర్శిటీ స్థాపనకు శ్రీకారం చుట్టారు. మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ఆర్ హయాంలో పీజి సెంటర్ యోగి వేమన యూనివర్శిటీగా మార్చి పెద్దఎత్తున నిధులు కేటాయించారు. అంత ర్జాతీయ ప్రమాణాలు కలిగిన యూనివర్శిటీగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆర్ట్స్‌తోపాటు పలు విభాగాలకు చెందిన భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించాల్సి ఉంది. రాజంపేటలో హార్టీకల్చర్ యూ నివర్శిటీ ఏర్పాటు చేస్తున్నామని హామీ నీరు గారిపోయింది. రైల్వేకోడూరు ప్రాంతంలో ఎక్కువగా వాణిజ్య పంటల వ్యాపారం సాగుతోంది. టిడిపి హయాంలో ఎమ్మెల్యేగా గెలిచిన మేడా నందలూరు ప్రాంతంలోని 200 ఎకరాల్లో హార్టీకల్చర్ యూనివర్శిటీ మంజూరు చేయిస్తానని ప్రకటించారు. ఈమేరకు ప్రభుత్వ అధినేత నుంచి హామీ సైతం పొందారు. అనంతరం దీని గురించి మరిచిపోయారని తెలుస్తోంది. గండికోట పర్యాటక ప్రాజెక్టును గ్రేటర్ క్యానాన్ తరహాలో అభివృద్ధి చేస్తామని ఊదరగొట్టారు. రూ.500 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దుతా మని గండికోట ఉత్సవాలకు హాజరైన అప్పటి టిడిపి హయాంలో మంత్రులు హడావుడి చేశారు. గండి కోటలో స్కైవాచ్ సదుపాయం కల్పిస్తానని హామీనిచ్చారు. జిల్లాలో అసంపూర్తిగా, అమలుకు నోచుకోని అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చకు తీసు కొచ్చి జిల్లాను అభివృద్ధిపథంలోకి నడిపించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సిఎం చంద్రబాబు (ఫైల్‌ఫోటో)

ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఆప్కాస్‌ను రద్దు చేస్తామన్న ప్రకటనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఆప్కాస్ లోని నాన్ టీచింగ్ స్టాఫ్ తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 2 ద్వారా ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రమే ఎంటిఎస్ వర్తింపజేస్తూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఇప్పటివరకు పని చేస్తున్న ఉద్యోగులందరికి తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. ప్రతినెల ఒక శాతం కమిషన్‌తో వేతనాలు, సర్వీసు అందించే ఆప్కాస్‌ని రద్దుచేసి, నాలుగు శాతం కమిషన్ తీసుకునే రాబందులు లాంటి కాంట్రాక్టర్ల చేతికి లక్షా 20 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తును అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన పాలన ఇస్తామని భద్రత లేని ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం మొగ్గు చూపడం సరైంది కాదన్నారు. ఒకపక్క రాష్ట్ర ఖజానాలో నిధులు లేవంటూనే కాంట్రాక్టర్లకు 70 కోట్లు చెల్లించేందుకు ఆప్కాస్‌ని రద్దు చేస్తున్నారన్నారు. కార్మిక ఉద్యోగుల ఓట్లతో గద్దె నెక్కి న కూటమి ప్రభుత్వం పర్మినెంట్ చేయడం లేదా జీతాలు పెంచి జీవితాలు మారుతాయని భావించిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ రద్దు చేయడం ద్రోహం చేయడమేనని అన్నారు. వెంటనే ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆప్కాస్‌లో ఉన్న నాన్ టీచింగ్ సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో షహనాజ్, వసంత, హాజీరా, కన్నమ్మ, బుజ్జమ్మ అరుణ, మంజూష,లక్ష్మీదేవి, శిరీష, మౌనిక, రాంచంద్రరెడ్డి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆప్కాస్ నాన్ టీచింగ్ సిబ్బంది

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : డిఐఒ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య పేర్కొన్నారు.ఆదివారం జిల్లా కార్యాలయంలో జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 49 పరీక్షా కేంద్రాల్లో జరుగుతుందని అన్నారు. 49 పరీక్ష కేంద్రాలలో నియమించబడిన చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, కస్టడియన్స్‌కు ఒరియంటేషన్, ట్రైనింగ్ సమావేశంలో జిల్లా పరీక్ష సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొదటి సంవత్సరం 14855, ద్వితీయ సంవత్సరం 13747 మంది విద్యార్థులు హాజరవు తారని అన్నారు. మార్చి 1నుంచి 20 వరకు జరుగుతాయని అన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందని అన్నారు. విద్యార్థులు 8.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. పరీక్షలు సిసి కెమెరాలు మధ్యలో జరుగుతాయిన్నారు. లైవ్ స్ట్రీమింగ్ ద్వారా జిల్లా కేంద్రంలో, ఇంటర్ బోర్డు ప్రధాన కేంద్రంలో నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందని చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రంలో గాలి, వెలుతురు ఉండేట్లు ఫాన్స్, లైట్స్, మరుగుదొడ్లు, కూర్చోడానికి బెంచ్ లు ఉండేట్లు చూడాలిన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, టాబ్లెట్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. సిబ్బంది, విద్యార్థులు ఎవరూ కూడా సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు పరిక్షా కేంద్రంలో కి తీసుకొని రాకూడదున్నారు. జిల్లా లోని 26 స్టోరేజ్ పాయింట్స్ కు సోమ, మంగళవారాల్లో ప్రశ్నపత్రాలు పోలీసు బందోబస్తు మధ్య చేరవేయడం జరుగుతుందిన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలులో ఉంటుందని అన్నారు. పరీక్ష జరిగే సమయంలో జిరాక్స్ షాపులు మూసివేయాల న్నారు. ఎక్కడ కూడా మాస్ కాపీ యింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశం లో జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబెర్స్ ప్రకాష్, అమరేంద్ర కుమార్, నాగ సురేష్ పాల్గొన్నారు.

'మిట్స్'లో ముగిసిన అశ్వ్-2కె25

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు సమీపం లోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అశ్వ్ 2కె25- జాతీయస్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్‌ను శని, ఆది వారాలలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెస్పాండంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమానికి సినీ హీరోయిన్ నేహా శెట్టి, సినీ గాయకులు సమీర భర్ద్వాజ్, దీపు, హారికనారాయణ్‌హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ యువత అనుకుంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరికి ఓపికా, సహనం చాలా అవసరం అన్నారు. విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని అధ్యయనం, అభ్యసనం, శిక్షణ, పరిశోధన ప్రత్యేక నైపుణ్యాలు అవసరమన్నారు. మిమిక్రీ ఆర్టిస్ట్ ఆర్.జె.సూర్య విద్యార్థులను తమ మిమిక్రీతో అలరించారు. ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ నాదేళ్ల ద్వారకనాథ్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎంతో మంది దేశ విదేశాల్లో ఉన్నత స్థానాలలో ఉన్నారని, విద్యార్థులకు అపారమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పారిశ్రామిక రంగాల్లో ఉన్నాయని సకాలంలో వాటిని ఉపయోగించుకోవాలని తెలిపారు. సింగర్స్ పాడిన పాటలు విద్యార్థుల ను ఎంతో ఆకట్టుకున్నాయి. రెండవ రోజు కార్యక్రమాన్ని కళాశాలనందు సినీ హీరోయిన్ నేహా శెట్టి విద్యార్థులను అలరించారు. విద్యార్థులతో తన సాంగ్స్‌తో విద్యార్థులతో నృత్యాలు చేసి ముచ్చటించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక, డ్యాన్స్, ఇతర కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ కమల్ బాషా, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

హీరోయిన్ నేహాశెట్టికి జ్ఞాపికను అందజేస్తున్న నాదేళ్ల ద్వారకనాథ్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

- ఉదయం పరీక్షకు 87.7 శాతం, మధ్యాహ్నం 87.48 శాతం హాజరు

ప్రజాశక్తి - కడప

జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగింది. అరగంట ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఎస్‌పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్, నెట్ సెంటర్లను మూత వేయించారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు, మొబైల్ ఫోన్లు వంటి వాటిని పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా పోలీసులు తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 5,825 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం సెషన్‌లో 5,111 మంది హాజరయ్యారు. హాజరు శాతం 87.74 శాతంగా నమోదైంది. మధ్యాహ్నం సెషన్‌లో 5,825 మందికి గాను 5,096 మంది హాజరయ్యారు. 87.48 శాతంగా నమోదైంది. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని డిఆర్ఒ విశ్వేశ్వరరావు తనిఖీ చేశారు. కేంద్రంలో అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన అన్ని వసతులను పరిశీలించారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించాయని ఆయన చెప్పారు.

పరీక్షలను పర్యవేక్షిస్తున్న డిఆర్ఒ

అభ్యర్థులను తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతిస్తున్న పోలీసులు

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం

డిఐఒ ఎం.కృష్ణయ్య

ముఖా ముఖి..

ప్రజాశక్తి రాయచోటి

మార్చి 1 నుంచి నిర్వహించబోయే ఇంటర్మీడియట్ పరీక్షలలో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎం. కృష్ణయ్య పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో మార్చి 1 నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలు ఎంత మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారో, విద్యార్థులు పరీక్ష ఎలా రాయాలో ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో జూనియర్ కళాశాలల వివరాలు తెలపండి ?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 153 ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలల న్నాయి.ఇందులో ప్రభుత్వ 25, ఎయిటెడ్ 1, ఎపిఆర్‌జెసి 2, మోడల్ స్కూల్ 17, కెజిబివి 22, ఒకేషనల్ 11, సోషల్ వెల్ఫేర్ 10, హై స్కూల్ 4, ఎంజెఆర్‌ఎపి 1, ప్రయివేట్ 57 జూనియర్ కళాశాలలున్నాయి.

ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు?

జిల్లా వ్యాప్తంగా 28,916 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాస్తున్నారు. ఇందులో మొదటి సంవత్సరంలో 13703 జనరల్,1159 ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 12944, ఒకేషనల్ 1110 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

పరీక్షల షెడ్యూల్ వివరిస్తారా ?

ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి 20 తేదీ వరకు, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. 1న మొదటి, 2న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. 1,2 వ తేదిలలో లాంగ్వేజ్, 4,5 తేదీలలో అగ్ల బాషా పరీక్ష, 6,7 వ తేదీల్లో గణిత శాస్త్రం, వృక్ష శాస్త్రం, పౌరశాస్త్రం,8,10 తేదీలలో గణిత శాస్త్రం 1 బి, జంతు శాస్త్రం , చరిత్ర,11, 12,వ తేదీలలో భౌతిక శాస్త్రం , అర్థశాస్త్రం, 13,15 తేదీ లలో రసాయన శాస్త్రం , వాణిజ్య శాస్త్రం , సమాజ శాస్త్రం , లలిత కళలు- సంగీతం, 17,18 వ తేదీ లలో ప్రభుత్వ పాలన శాస్త్రం , తర్క శాస్త్రం, బ్రిడ్జ్ కోర్స్ - గణిత శాస్త్రం (బై. పి.సి విద్యార్థుల కొరకు),19,20 తేదీలలో ఆధునిక భాషా , భౌగోళిక శాస్త్రం జరుగుతాయి.

పరీక్ష కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా 49 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. 23 ప్రయివేట్ కళాశాలలు,26 ప్రభుత్వ కళాశాల్లో ఏర్పాటు చేశాం.

పరీక్షలకు ఎంత మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు?

చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు 49, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 49, సిట్టింగ్ స్క్వాడ్ 4, ఫ్లయింగ్ స్క్వాడ్ ఇద్దరిని ఏర్పాటు చేశాం.

పరీక్షలకు హాజరు అయ్యే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పిస్తున్నారా?

ఇటీవల కాలంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్ని శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన ఆదేశాల మేరకు పరీక్ష జరిగే సమయంలో ఉదయం, మధ్యాహ్నం ఆర్‌టిసి బస్సును సౌకరాలు కల్పిస్తున్నాం.

పరీక్ష కేంద్రాల వద్ద ఎంటు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎం అందుబాటులో ఉంటారు. అలాగే తాగనీరు, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశాం. జిరాక్స్ సెంటర్లను కూడా మూసివేస్తున్నాం. సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం. జిల్లా, రాష్ట్రస్థాయిలో అధికారులు సిసి ఫుటేజ్‌లో పర్యవేక్షిస్తారు.

విద్యార్థులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ప్రయవేట్ కళాశాలలో హాల్ టికెట్లు ఇవ్వకుండా ఎవరైనా ఇబ్బంది పెడితే ఇంటర్‌నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సెంటర్‌లోకి విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే చేరుకోవాలి. విద్యార్థులకు ప్రతి సెంటర్లో కావాల్సిన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేశాం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసి అన్నమయ్య జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి సహకరించాలి.

బిసి కుల జనగణన చేయాల్సిందే

బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసి కుల జన గణన చేయాల్సిందేనని రౌండ్ టేబుల్ సమావేశంలో బిసి నేతలు డిమాండ్ చేశారు. బహుజన సేన ఆధ్వర్యంలో శ్రీచందు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచందు, బిసి నేతలు మాట్లాడుతూ 1950 నుంచి భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక, కేంద్ర, రాష్ట్ర విద్యా ఉద్యోగ రంగాలలో వెనుకబడిన వర్గాల ప్రజలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం తగు ప్రాతినిధ్యం అందలేదన్నారు. మహాత్మ పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్షీరామ్, సాహూ మహారాజ్, మహనీయుల త్యాగఫలం వల్ల రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16 రూపకల్పన జరిగి విద్యా, ఉద్యోగ రంగాల్లో బిసి జనాభా సంఖ్యలో సగం మాత్రమే వాటా లభిస్తుందన్నారు. దేశంలో జరుగుతున్న బిసిల హక్కుల హననాన్ని, జనాభా లెక్కించకుండా, బిసిల సంఖ్యా బలాన్ని బయట పెట్టకుండా, జనాభా నిష్పత్తి కంటే అవకాశాలు తక్కువ రావడం అణిచివేతకు కారణం అవుతుందని అన్నారు. మేధావి వర్గ నాయకులు డివి రమణ మాట్లాడుతూ భారతదేశంలో అన్ని కులాలను లెక్కించి, బిసి కులా లను కూడా లెక్కించి వారి జనాభాను బయటపెట్టి వారికి రావాల్సిన వాటాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిం చాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మురళీధర్ రావు కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్, మీనా‌‌ కుమారి, జబ్బల శ్రీనివాస్, దుడం రెడ్డి బాబు, సిపిఐ సాంబశివ, సిపిఎం శ్రీనివాసులు, టిడిపి బిసి సెల్ రెడ్డి ప్రసాద్ పాల్గొని బిసి డిక్లరేషన్ కు మద్దతు పలికారు. 14 పాయింట్లతోమదనపల్లె బీసీ డిక్లరేషన్‌ను ఆవిష్కరించారు. అనంతరం మదనపల్లి బిసి డిక్లరేషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. బిసిలకు అన్ని రంగాల్లో 50శాతం వాటాను అమలు చేయాలని, అవసరమైతే పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రాయలసీమ ప్రాంతం నుంచి అన్ని వర్గాల బిసి నాయకులు, వాల్మీకి సంఘం పులి శ్రీనివాసులు, రజక సంఘ రాము రామ్మూర్తి, మేదర సంఘం సుబ్బు, రాయలసీమ విద్యార్థి సంఘం ఉత్తన్న, మరాఠీ సంఘం నాయకులు, మైనార్టీ సంఘ నాయకులు, చేనేత సంఘాలు నాగరాజన్న, వీర భాస్కర, బిసి విద్యార్థి సంఘ నాయకుడు వెంకట్ యాదవ్, బహుజన సేన నాయకులు జయశంకర్, లక్ష్మీనారాయణ,గిన్నెల మనోహర్ రెడ్డి, మూడే రూపక్ నాయక్, రెడ్డి భాను ప్రకాష్, రాఘవేంద్ర, హరిబాబు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన బిసి నాయకులు

విద్యతోపాటు మానసిక స్థైర్యం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

పిల్లలకు విద్యతోపాటు పాఠశాల స్థాయి నుంచే దేశభక్తి, మానసిక స్థైర్యం, సమయోధుల సేవా స్ఫూర్తి, క్రమశిక్షణలు అలవర్చడంతోపాటు వారి సమాజిక వికాసానికి తోడ్పాటు అందివ్వడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు శ్రీభువన విద్యాలయం వ్యవస్థాపకురాలు జి.ఉమారమాదేవి తెలిపారు. పీలేరు పట్టణ శివారు ప్రాంతమైన చిత్తూరు మార్గంలోని శ్రీభువన విద్యాలయంలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రెండు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 350 మంది విద్యార్థులకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 8 మంది శిక్షకులు శిక్షణ ఇవ్వడం కోసం హాజరయ్యారన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ అంటే ఏంటని విద్యార్థులకు అర్థాన్ని వివరిస్తూ, విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపుతూ, ఏకాగ్రత, క్రమశిక్షణను అలవర్చడానికి, వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం దోహదపడేలా ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి తమ విద్యాలయం వేదిక అయినందుకు తమకెంతో సంతోషంగా ఉందని అన్నారు. పిల్లల్లో వ్యక్తిత్వాన్ని పెంచడం, మంచి ఆరోగ్య అలవాట్లను నేర్పడం, చేతి వృత్తుల్లో శిక్షణ ఇవ్వడం, వారికి ఉపయోగకరమైన విద్యాపరమైన నైపుణ్యాలను నేర్పడం, సమగ్ర సేవా స్ఫూర్తిని స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా అందించి పిల్లల వికాసానికి తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి దోమ చెన్నారెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కమిషనర్ గమిడి స్వర్ణలత, స్కౌట్ మాస్టర్స్ దివాకర్ రెడ్డి, తేజ రెడ్డి, సుదర్శన్, ఠాగూర్ నాయక్, గైడ్ కెప్టెన్స్ నర్మద, ఝాన్సీ రాణి, శ్రీ భువన విద్యాలయం ప్రిన్సిపల్ గుణ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :రాజంపేటను స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం రీజెన్సీ నలంద విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి.ఎన్.నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం రీజెన్సీ విద్యాసంస్థల తరఫున స్వచ్ఛత కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాలలో పాల్గొనడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛతపై అవగాహన పెంచుకొని రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయా లన్నారు. రీజెన్సీ నలంద ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి గతంలో కూడా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రావడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మున్సిపల్ పార్కులో చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆకేపాటి మురళిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకుంటున్న రైతులు

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని రైతులు ఈ నెల ఆఖరి లోగా రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకోవాలని ఎఒ రమణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. భూమి పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ లతోపాటు ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబర్ తో వారి వారి రైతు సేవ కేంద్రాలు సంప్రదించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల కోసం ఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు.

రేపు పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు మండల కేంద్రం లోని ఎస్ఎవిడి సత్ హైస్కూల్లో మంగళవారం టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు సయ్యద్ సర్దార్ హుస్సేన్ తెలిపారు.ప్రతి ప్రభుత్వ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఈ టాలెంట్ టెస్ట్ లో అవకాశం కలదని, ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేపర్ వాల్యుయేషన్ పూర్తి చేసి మధ్యాహ్నం భోజనం తర్వాత విజేతలను ప్రకటించి చనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహు మతిగా రూ.2వేలతో పాటు ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒలు జి.చక్రధర్‌రాజు, డి.నాగభిరుమలరావు హాజరవుతారని పేర్కొన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న బండెన్న స్వామి ఆలయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతి

మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని బీరంగి పంచాయతీ శంకరాపురం వద్ద ఉన్న గుట్టపై కోనలోని బండెన్నస్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబ వుతోందని ఆలయ అర్చకులు పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి పేర్కొన్నారు. ప్రతి ఏడాది జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా ప్రజలు ఎక్కువ సంఖ్యలో తెలిపారు. కాంతులతో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆలయానికి వెళ్లే మార్గంలో భారీ ఏర్పాటు చేయడం జరిగింది.ముఖ్యంగా ఇక్కడ ఏర్పాటు చేసిన 251 దేవతామూర్తుల విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలతోపాటు సులభంగా స్వామివారి దర్శనం కల్పిస్తున్నామని చెప్పారు.శివరాత్రి ముందు రోజు 25నచెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పిఎం కిసాన్ నిధులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి : పిఎం కిసాన్ సమ్మాన్‌నిధి యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభు త్వం రైతులకు అందిస్తున్న సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎం కిసాన్ సమ్మాన్‌నిధి యోజన పథకం ద్వారా రైతులకు 19వ విడత నిధులను సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేయనున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ ద్వారా అందిస్తున్న రూ.2వేలు యథావిధిగా అర్హులైన ప్రతి రైతుల బ్యాంకు ఖాతాలోకి జమవు తాయని తెలిపారు. నిమ్మనపల్లి మండలంలో రూ.96.16 లక్షల ను అర్హులైన 4808 మంది రైతులు లబ్ధి పొద్దనున్నారని పేర్కొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలోని మర్రిచెట్టు లక్ష్మి నరసింహ స్వామి ఆలయ బయట ప్రాంగణంలో ఉంటూ చుట్టుపక్కల వారి సహకారంతో జీవనం సాగిస్తున్న అనాథ వ్యక్తి ఆదివారం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మానవతా సభ్యులు ఆర్థిక సాయం అందించి అంత్యక్రి యలు నిర్వహించారు. కార్యక్రమంలో మానవతా డైరెక్టర్ వేమిరెడ్డి రాజారెడ్డి, సెక్రటరీ ఆదిమూలం రామచంద్ర, సభ్యులు గడ్డం. ప్రభాకర్ రెడ్డి ఎఎస్ఐ మస్తాన్‌వలి, విఆర్ఒ పుష్పరాజ్ పాల్గొన్నారు.

దళితుల ఇళ్లకు రక్షణ కల్పించండి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-పీలేరు : మండలంలోని జాండ్ల పంచాయతీ, బసిరెడ్డిగారిపల్లి మాదిగపల్లెలో సిద్ధారెడ్డి అనే వ్యక్తి దౌర్జన్యంగా జెసిబి సహాయంతో దళితుల ఇళ్ల ప్రక్కన ఉన్న చెట్లను పెరికి వేయడం చాలా దారుణమని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడి అక్కడి జరుగుతున్న అన్యాయంపై ఆరా తీశారు. దళిత గ్రామానికి రక్షణ లేకుండా పోతోందని, వారి సొంత భూమి అయితే రాత్రికి రాత్రే జెసిబిలతో చెట్లు పీకి వేయాల్సిన పని ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జెసిబితో చదును చేస్తుండగా అక్కడ నివాసం ఉన్నవారు అడ్డుకొని, ఇది మా పూర్వీకుల జాగా అని, ఇక్కడ ఎటువంటి పనులు చేయొద్దని ఆక్షేపించామని అన్నారు. అతను మీ ఇళ్ల దగ్గర చేయలేదు, మేం పక్కన మా భూమి చదును చేసుకుంటున్నామని మాయమాటలు చెప్పి రాత్రి పూట అందరూ నిద్రపోయాక జెసిబి సహాయంతో టెంకాయ చెట్లను వేర్లతో సహా తీసి పూడ్చివేశారని అన్నారు. ఉదయం నిద్ర లేచి చూసి గ్రామస్తులు హవాక్కయ్యార న్నారు. ఇదేమని ప్రశ్నించగా దౌర్జన్యంగా కులం పేరుతో దూషించారని అన్నారు. ఈ విషయంపై పీలేరు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. పోలీసులు విచారించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఆ గ్రామానికి సంబంధించి సరిహద్దులు చూపి గ్రామ స్థలానికి రక్షణ కల్పించాలని బాధితులు కోరారు. కార్యక్రమంలో ఎంఆర్ పిఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, ఎంఎస్‌పి సీనియర్ నాయకులు ఈపూరి వెంకటరమణ, గ్రామ స్తులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SHAIK JAKRIYA** (old name), S/o Shaik Saheb Jan, resident of D.No.20/61-A, Ravi Hall back side, Kottapalli, Rayachoti, Annamayya Dist., Andhra Pradesh. Hence forth be known as **SHAIK ZAKRIYA (new name).**

CHANGE OF NAME

I, **DANDU RIZWAAN** (old name), S/o Dandu Mustafa, resident of D.No.1-93, Bhagampalli Kaspa, Bhagampalle, T Sundupalli, Annamayya Dist., A.P. -516130. Henceforth be known as **SHAIK RIZWAN (new name).**

CHANGE OF NAME

I, **REFKULAKUNTA SRINIVASULU** (old name), S/o Rekula Kunta Venkataramana, resident of D.No. 4/268, KOLIMIMITTA, CHENNAMUKKA PALL, Rayachoti, Annamayya Dist., A.P. - 516269. Henceforth be known as **REKULA KUNTA SRINIVASULU** (new name).

'వెలిగల్లు' ఉన్నా తీరని తాగునీటి సమస్య

- ట్యాంకర్లతో తాగునీటి సరఫరా
- వేసవి సమీపిస్తుండటంతో ఆందోళన చెందుతున్న ప్రజలు
- శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు

వెలిగల్లు ప్రాజెక్టు

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు ప్రాజెక్టు చెంతనే ఉన్నా..మండలంలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. ఇప్పటికే ప్రారంభమైన వేసవి తాపానికి ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి మండలంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి నీరు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీరు అందించే పరిస్థితి ఏర్పడుతోంది. ఎగువగొట్టి వీడు పంచాయతీ గొల్లపల్లికి ఉదయం, సాయంత్రం రెండు పూటలా ట్యాంక్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గోరాన్ చెరువు, పెద్దపల్లి వద్ద ఒక ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. సిసిపల్లె ప్రజలు కూడా ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందించాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజక వర్గానికి ప్రాతినిథ్యం వమిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాలలో 350 బోర్లు వరకు వేపించారు. ఫిబ్రవరి మాసంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే మే మాసానికి పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జెఇని వివరణ నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, చిన్న మండెం, సుండుపల్లి, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు ఆరు మండలాలకు వాటర్ గ్రిడ్ పథకం ద్వారా రూ.430 కోట్ల వ్యయంతో శాశ్వత మంచి నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వెలిగల్లు నుంచి నియోజ కవర్గంలోని చుట్టుపక్క మండలాలకు నీరు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున టెండర్లు ప్రారంభించడం ఆలస్యమవుతున్నదని అన్నారు. టెండర్ అయి పోయిన వెంటనే ఈ పనులు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు.

గొట్టివీడు, గొల్లపల్లి వద్ద ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

జరి మహోత్సవానికి పటిష్ట భద్రత :డిఎస్‌పి

జరి ఉత్సవ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి-కలకడ

జరి మహోత్సవ ప్రాంతాన్ని రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ పరిశీలించారు.మండలంలోని దేవళంపేటలో ని శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా డిఎస్‌పి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించినట్లు తెలిపారు. జరి మహొత్సవ కార్యక్రమం మహాశివరాత్రి రోజున భక్తులు శ్రీ కామాక్ష సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో జాగరణ నిర్వహించి మరుసటి రోజు గురువారం వేకువజామునే శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి జరి మహో త్సవ ప్రాంతానికి బయలుదేరి వెళతారు. జరి మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జరి మహోత్సవానికి పీలేరు, మదనపల్లి, రాయచోటి డిపోలకు చెందిన బస్సులు వేయడం జరుగుతుందని వాటిలోనే భక్తులు ప్రయాణించాలని అందుకు తమ సిబ్బంది సహకారం అందించడం జరుగు తుందని తెలిపారు కార్యక్రమంలో కలకడ, కెవిపల్లి ఎస్ఐలు రామాంజ నేయులు, చిన్న రెడ్డప్ప పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకు ఎప్పటికి పూర్తయ్యేనో..!

- ఏడేళ్లుగా ఆగిపోయిన పనులు
- తాగునీటితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని సుమారు 14 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం సుండుపల్లిలోని స్థానిక జడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో నీటి ట్యాంకర్ ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. ఇప్పటికి ఏడేళ్లు కావస్తున్నా ఇంత వరకు నీటి ట్యాంకర్ నిర్మాణం పూర్తి చేయకపోవడంతో మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోళ్లమడుగు నుంచి నీటిని సుండుపల్లెకు తేవాలని కోట్లాది రూపాయలను ఖర్చు చేసి పైపులు కూడా కొన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేశారని, ఆ పనులు మధ్యలోనే ఆగిపోవడం చాలా బాధాకరమని అన్నారు. వేసవికాలం సమీపిస్తుండంతో బోర్లు కూడా ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, తాగునీటికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంటు న్నారు. ప్రభుత్వాలు మారినా మా గోడు పట్టించుకునే వారే లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రారంభించిన పనులు మధ్యలోనే ఆపివేయడం ప్రజాధనం వృథా కావడమేనని అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టి నీటి ట్యాంకర్ నిర్మాణాన్ని పూర్తి చేసి మండల ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

మధ్యలోనే నిలిచిపోయిన తాగునీటి ట్యాంకర్

మార్చి 23న రాయలసీమ మాలల సింహ గర్జన

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు సభ్యులు

ప్రజాశక్తి-పీలేరు

ఎస్‌సి వర్గీకరణ క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ మార్చి 23న తిరుపతి పట్టణంలో నిర్వహించనున్న రాయలసీమ మాలల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పీలేరు పట్టణం, అంబేద్కర్ విగ్రహం వద్ద రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుభాష్ ఆధ్వర్యంలో మాలల సింహగర్జన బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అరిపెంట లక్ష్మీ నారాయణ, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ అంశంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, ఈ తీర్పు ద్వారా క్రిమిలేయర్ అంటూ రిజర్వేషన్ ఎత్తివేసే ఆలోచన మానుకోవాలని అన్నారు. రిజర్వేషన్ ఎత్తివేసే కుట్రలో భాగంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలన చేయాలన్నారు. ఎస్‌సి వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన వన్ మ్యాన్ కమిషన్ రద్దు చేయాలని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచి ఇవ్వాలని, బ్యాక్ లాగ్ పోస్టులు, కార్పొరేషన్ రుణాలను కూడా దామాషా ప్రకారం రిజర్వేషన్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమ మాలల సింహగర్జనకు మాల ఉద్యోగులు, మేధావులు, విద్యార్థి సంఘాలు, అంబేద్కర్ వాదులు లక్షలాదిగా తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు దప్పేపల్లి ఆనంద్, ద్వారక, పురుషోత్తం, దామోదరం, రాజేంద్రబాబు, రవిబాబు, దామోదర, రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మైఫోర్స్ మహేష్

అసెంబ్లీకి వెళ్లకుంటే రాజీనామాలు చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అసెంబ్లీకి వెళ్లకుంటే వైసిపి ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాలని జనసేన పార్టీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ మైఫోర్స్ మహేష్ డిమాండ్ చేశారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహేష్ మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగం ప్రకారం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయిన అసెంబ్లీకి ప్రతీ ఎమ్మెల్యే వెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తూ, భారతదేశ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ ఇప్పటి వరకు జరిగిన మూడు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లలేదంటే వాళ్లకు ప్రజాస్వామ్యం పై ఎంత గౌరవ ముందో అర్థమవుతుందని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు అమరనారాయణ, వీర మహిళలు శోభ, సునీత, నగీనా, జనసేన పార్టీ నాయకులు అశోక్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరు మణిపాల్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం పట్టణంలోని సొసైటీ కాలనీ, రామాలయం సమీపంలోని పీపల్ ట్రీ హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించడంతో వాసవి, వనిత క్లబ్ ప్రతినిధుల హర్షం వ్యక్తం చేశారు. ఎముకలు, కీళ్ల మార్పిడి నిపుణులు డాక్టర్ శివారెడ్డి, గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రదీప్ హర్నహల్లి, గ్యాస్ట్రో ఎంటరాలజీ, జీర్ణాశయాంతర వైద్య నిపుణులు డాక్టర్ బాలాజీ, లక్ష్మీ నారాయణశెట్టి వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మంది ప్రజలు ఈ వైద్య శిబిరానికి విచ్చేసి పరీక్షలు చేయించుకున్నారు. వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివారెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో వాసవి, వనిత ఇంటర్నేషనల్ ముందు వరుసలో ఉంటుందన్నారు. వారి సేవా కార్యక్రమాలలో మణిపాల్ ఆసుపత్రి భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. మున్ముందు మరిన్నీ వైద్య శిబిరాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎల్లంపల్లి ప్రశాంత్, తహశీల్దార్ ధనుం జయులు, సిఎస్‌డిటి ఫిరోజ్‌ఖాన్ హాజరుకాగా, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసి డెంట్ కేఎస్ కృష్ణమూర్తి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ వి.వెంకటేష్ బాబు, వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు శ్వేత, ప్రధాన కార్యదర్శి భానురేఖ, కోశాధికారి సంధ్య, ప్రీతి, ఎంఎస్ ఫణికుమార్, నగేష్, అమరనాథ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వాసవి, వనిత క్లబ్ ప్రతినిధులు

బాధితులను పరామర్శిస్తున్న ప్రసాద్‌బాబు

మానవత్వం చాటుకున్న 'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదరి సుగవాసి ప్రసాద్‌బాబు రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని దగ్గరుండి ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. రాయచోటి రూరల్ మండలం శిబ్యాల గ్రామం అన్నంరాజు గారిపల్లె లో దేవాలయం విగ్రహ ప్రతిష్టాపన కార్యకమానికి వెళు తున్న సమయంలో శిబ్యాల దగ్గర టాటా ఎస్ వాహనం బోల్తా పడింది. గమనిం చిన ప్రసాద్‌బాబు సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్సు కు ఫోన్ చేసి అక్కడ గాయపడిన వారందరిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులకు ఫోన్ చేసి మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

కరాటే గ్రాండ్ మాస్టర్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



డాక్టర్ ఎ.ఆర్.సురేష్(ఫైల్ ఫొటో)

కరాటే గ్రాండ్ మాస్టర్, మదనపల్లె కరాటే యూత్ క్లబ్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎఆర్.సురేష్ ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. సురేష్ మృతి పట్ల పలువురు పట్టణ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మదనపల్లె పట్టణం, సొసైటీ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన యూత్ కరాటే క్లబ్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ స్థాపించి ఎంతోమంది విద్యార్థులను కరాటే శిక్షణలో తీర్చిదిద్దారని అన్నారు. కరాటే మాస్టర్ గా ఉంటూనే పాత్రికేయ వృత్తిలో ప్రవేశించి, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి పని చేశారని అన్నారు. డాక్టరేట్ పట్టా పొందిన సురేష్ పేద విద్యార్థులకు కరాటే శిక్షణలో ఎంతో చేయూత ‘నందిం చారని అన్నారు. మహిళా పోలీసులు, విద్యార్థినిల్లో ఆత్మస్థైర్యాన్ని నింపే విధంగా స్ఫూర్తినించారు. అంతేకా కుండా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం, పేద విద్యార్థులకు పుస్తకాల వితరణ, వృద్ధులకు అన్నదానం, అనాథలకు ఆపన్న హస్తం అందించడం, స్వచ్ఛహి సేవా కార్యక్రమాలతో పాటు సమాజ హితం కోసం అహర్నిశలు పాటుపడి ఎన్నో అవార్డులను పొందారని కొనియాడారు. ఆయన మృతి మదనపల్లె వాసులకు తీరని లోటని, పలువురు అన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విజయ భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, పలువురు విద్యాసంస్థల అధినేతలు, కరాటే గ్రాండ్ మాస్టర్లు, కరాటే విద్యార్థులు, పాత్రికేయులు సురేష్ మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు. కరాటే గ్రాండ్ మాస్టర్, సమాజ సేవకుడు డాక్టర్ సురేష్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. సురేష్ మృతదేహం వద్ద ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆయన అత్మకు శాంతి కలగాలని, తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

క్రైం కార్నర్

నాటుసారాను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-కలకడ

20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్ట్ల చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని దిగువతాండ పంచాయతీ ఎగువతాండ పడమటి వైపున నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసు సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎగుతాండాకు చెందిన తిరుపాల్‌నాయక్ సుమారు వంద లీటర్ల నాటు సారా తయారు చేయడానికి ఉంచిన సారా ఊటను ధ్వంసం చేసి, తయారు చేసి ఉంచిన 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తిరుపాల్‌నాయక్‌ను అరెస్టు చేసి కోర్టు హాజరపరిచినట్లు తెలిపారు.ఈ దాడులలో యూనస్ ఇమ్రాన్,డ్రైవర్ రమేష్, బాబు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లెలో తీవ్ర కలకలం రేపింది. మండలంలోని పుంగనూరు రోడ్డు, బసినికొండ ఆంజనేయ స్వామి గుడి సమీపంలోని నక్కల కుంటలో గాలివీడుకు చెందిన టంగుటూరి నాగరాజు(26) అనుమానాస్పద స్థితిలో మృతి చెంది, చెరువు నీటిలో మృతదేహం తేలియాడుతూ ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. తాలూక సిఐ కళా వెంకటరమణ వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. జేబులో ఉన్న ఎన్నికల గుర్తింపు కార్డు ఆధారంగా మృతుడు గాలివీడు కు చెందిన టంగుటూరి యశోదమ్మ కుమారుడు టంగుటూరి నాగరాజుగా గుర్తించారు. అనంతరం కుటుంబీకులకు సమాచారం అందించి, మృత దేహాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆస్పత్రి లోని తరలించారు. నాగరాజా మృతిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని సిఐ తెలిపారు.

స్కీం బోరుకు నిప్పు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లె బిసి కాలనీకి తాగునీరు అందించే మంచినీటి పథకానికి సంబంధించిన వైర్లు, స్టార్టర్‌కు ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో మోటార్ వైర్లు, స్టాటరు కాలిపోయాయని గ్రామస్తులు తెలిపారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి గ్రామస్తులు ఫోన్ చేయగా మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. స్కీం బోరు వైరు కాలిపోవడంతో తాగునీటికి ఇబ్బంది కలిగిందని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని గ్రామానికి తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరారు.

మంటల్లో కాలిపోతున్న స్కీం బోరు వైర్లు, స్టార్టర్